క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహం వద్ద డీహెచ్‌పీఎస్ నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘం నాయకులు

గోపాలపట్నం: సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి చేయడాన్ని రాజ్యాంగంపై దాడిగా పరిగణించాలని దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కేవీ ప్రభాకర్ అన్నారు. న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ ఎన్ఏడీ జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద డీహెచ్‌పీఎస్ మంగళవారం ఆందోళన చేపట్టింది. సమితి అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ లాయర్ రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్పీలు ప్రేమ్ కుమార్, ప్రకాశరావు, ఎస్.రాజులు, జి.రాంబాబు, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

నారికేళం అ'ధర'హో



మూడు రకాలుగా విభజించి అమ్మకానికి ఉంచిన కొబ్బరి కాయలు

అగనంపూడి: కొబ్బరి కాయల ధరలు మునుపెన్నడూ లేని విధంగా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒకప్పుడు శ్రావణ, కార్తీక మాసాలు, లేదా దసరా ఉత్సవాల సందర్భంగా రూ.40 నుంచి రూ.50 పలికే కొబ్బరి కాయ, ఇప్పుడు పండుగలు పోయినా సరే అదే ఊపు కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఒక మోస్తరు సైజు కాయ ధర రూ.60 నుంచి రూ.70 పలుకుతుండగా, మధ్యరకం కాయలు కూడా రూ.50–60 కి తగ్గడం లేదు. చిన్న కాయ ధర సైతం రూ.30 దాటిపోయింది. దీంతో 'కొబ్బరి కాయ కొని దేవుడికి సమర్పించే బదులు... ఆ డబ్బులు నేరుగా హుండీలో వేసేయడం ఉత్తమం' అన్నంతగా భక్తులు ఆలోచిస్తున్నారు. ఈ ధరల దూకుడుకు ముఖ్య కారణం కొబ్బరి బొండాల వ్యాపారం. లేతగా ఉన్నప్పుడే రైతుల వద్ద నుంచి కాయలను కొబ్బరి బొండాల వ్యాపారులు కొనుగోలు చేసి, వాటిని ఒక్కొక్కటి రూ.40 నుంచి రూ.60 వరకు అమ్ముకుంటున్నారు. ఫలితంగా ఆలయంలో కొట్టడానికి ముదిరిన కాయలు దొరకడం కష్టమై, వాటికి తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో చిరు వ్యాపారులు సైతం రైతుల వద్ద నుంచే కాయలను రూ.25 నుంచి రూ.30కు కొనుగోలు చేయాల్సి వస్తుండడంతో, చివరకు భక్తుల జేబుకు చిల్లు పడుతోంది.

అప్పన్నకు పౌర్ణమి తిరువీధి



అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం సాయంత్రం తిరువీధిని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేశారు. ఆలయ బేడామండపంలో తిరువీధి జరిపారు. విశేష హారతులు అందించారు. అధ్యాపకులు పారాయణం చేశారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత వెంకటేశ్వర్లుకు బాండ్ అందిస్తున్న ఏఈవోలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గుజరాత్‌లోని జామ్‌నగర్‌కి చెందిన ఎం.ఎస్.వెంకటేశ్వర్లు లక్షా ఒక రూపాయి విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, అన్నప్రసాదం విభాగం ఏఈవో రమణమూర్తిలు దాతకు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.



ఐసీయూ గదికి తాళం



ఆస్పత్రి మెట్లు దిగువ తుప్పు పట్టిన మంచాలు



ఆస్పత్రిలో మూడు మంచాలు..

పేరుకే ఆస్పత్రి వైద్యులు ఉండరు

• వైద్య సేవలపై ప్రభుత్వం నిర్లక్ష్యం • మందులు కరవు, సౌకర్యాలు శూన్యం • దయనీయంగా గుల్లలపాలెం ఆస్పత్రి

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంత పేద రోగులకు సంజీవినిగా ఒకప్పుడు పేరుగాంచిన జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం ఆస్పత్రి ప్రస్తుతం దయనీయంగా మారింది. పేరుకు 30 పడకల ఆస్పత్రి అయినప్పటికీ ప్రస్తుతం ఇక్కడ అందుబాటులో ఉన్న మంచాలు కేవలం మూడే కావడం గమనార్హం. సుమారు 40 సంవత్సరాల క్రితం 58, 59, 60వ వార్డుల పరిధిలోని పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో జీవీఎంసీ ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. కాలక్రమంలో ఇది 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చెందింది. అప్పట్లో ఇక్కడ వైద్య నిపుణులు, శస్త్రచికిత్సల కోసం ప్రత్యేక ఆపరేషన్ థియేటర్, సాధారణ వైద్య చికిత్సల కోసం ప్రత్యేక గది వంటి అనేక వసతులు ఉండేవి.

వైద్య వసతులు మాయం

ఆస్పత్రి వెనుక భాగంలోని గదులలో వివిధ జీవీఎంసీ కార్యాలయాలను ఏర్పాటు చేయడంతో, ఆ గదుల్లోని మంచాలను మూలన పడేశారు. 2013 జూన్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన గదులపై అదనపు నిర్మాణాలు చేపట్టి, ప్రసూతి వైద్యశాల, ఆధునిక చిల్డ్రన్ వార్డు, అదనపు రోగుల గదులు వంటి సౌకర్యాలు కల్పించారు. అయితే ఈ



ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి ముఖ ద్వారం

సౌకర్యం కొన్నేళ్లకే పరిమితమైంది. ప్రస్తుతం 2013లో నిర్మించిన గదులకు సైతం తాళాలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎప్పుడు బాగుపడేనో?

పరికరాలు పనిచేయక, వైద్యులు అందుబాటులో లేక 30 పడకలకు గాను కేవలం మూడు మంచాలతోనే ఈ ఆస్పత్రి నామమాత్రంగా మిగిలిపోయింది. మాయమైన పడకలు కొన్ని కాగా, మరికొన్ని మెట్ల కింద తుప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంత పేదలు ఈ ఆసుపత్రికి పూర్వ వైభవం ఎప్పుడు వస్తుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ముఖ్య సమస్యలు



- వైద్య నిపుణుల కొరత
- అన్ని రకాల మందులు లభించకపోవడం
- ఐసీయూ, ఆపరేషన్ గదిలోని పరికరాలు పనిచేయకపోవడం
- ఆస్పత్రిలో జనరేటర్ సదుపాయం లేకపోవడం

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం



తోటగరువు హైస్కూల్‌లో పిల్లలతో ర్యాలీ చేస్తున్న మెంటల్ హెల్త్ కౌన్సెలర్లు

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మెంటల్ హెల్త్ కౌన్సెలర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి తోటగరువు హైస్కూల్ పరిసరాల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం అవగాహన కార్యక్రమంలో కౌన్సిలర్లు ఝాన్సీ, రమ మాట్లాడుతూ మంచి మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులు ఆశపడి ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీని కోసం విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మానసిక ఆందోళన, ఒత్తిడిని అధిగమించడానికి యోగా అవసరమన్నారు. యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందన్నారు. దీంతోపాటు రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు, కాయగూరలు, పండ్లు తినాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

40వ రోజుకు చేరిన రిలే దీక్షలు



దీక్ష చేస్తున్న కార్మికులను కలిసి మద్దతు తెలుపుతున్న రీజనల్ సెక్రటరీ శంకర్

ఉక్కునగరం: స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో తరలింపును వ్యతిరేకిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 40వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం లీజు గడువు ముగియడంతో డిపో స్థలాన్ని ఖాళీ చేయాలని, లేదంటే రూ. 130 కోట్ల డిపాజిట్‌తో పాటు అద్దె చెల్లించాలని ఆర్టీసీకి నోటీసు జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులకు విన్నవించారు. ఈ అంశంపై ఎస్ఎంయూ ఆధ్వర్యంలో డిపో ఆవరణలో జరుగుతున్న దీక్షా శిబిరాన్ని యూనియన్ రీజనల్ సెక్రటరీ పి. శంకర్ సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ ఢీకొని వృద్ధురాలి మృతి

పెందుర్తి: పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్ సుజాతనగర్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైంది. వివరాలివి.. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్ సమీపంలోని హస్మినగర్‌లో పసగడుగుల అప్పారావు, అమ్మాజీ(65) దంపతులు నివాసం ఉంటున్నారు. పనుల నిమిత్తం మంగళవారం సాయంత్రం అమ్మాజీ బయటకు వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతుండగా మధ్య రోడ్డులో వస్తున్న ఆర్టీసీ బస్ బలంగా ఢీకొట్టింది. బస్ చక్రాలు ఆమె మీద నుంచి వెళ్లిపోవడంతో అమ్మాజీ అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.నరసింగరాజు ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. లా అండ్ ఆర్డర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.



సుజాతనగర్ బీఆర్‌టీఎస్‌పై ప్రమాద దృశ్యం, (ఇన్‌సెట్) అమ్మాజీ మృతదేహం

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో ఇమంది శ్రీనివాసరావు

పెదగంట్యాడ: మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి ఇమంది శ్రీనివాసరావు సూచించారు. జాతీయ హెల్త్ మిషన్ సౌజన్యంతో పొగాకు, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించినందుకు గాను, మండలంలోని ముగ్గురు విద్యార్థులను ప్రచారకర్తలుగా ఎంపిక చేశారు. వీరిలో గంగవరం హైస్కూల్‌కు చెందిన వాకాడ అంజలి సాయి (9వ తరగతి), నడుపూరి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి బి. త్రివేణి (8వ తరగతి), ఇస్లాంపేట హైస్కూల్‌కు చెందిన రేలంగి లక్ష్మి (9వ తరగతి) ఉన్నారు. వీరికి జిల్లా విద్య, వైద్య ఆరోగ్య శాఖాధికారులు అందజేసిన బహుమతులను ఎంఈవో శ్రీనివాసరావు మంగళవారం కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాజాలో మారణహోమం ఆపాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పౌర చైతన్య వేదిక సభ్యులు

బీచ్‌రోడ్డు: గాజాలో ఇజ్రాయెల్ రెండేళ్లుగా సృష్టించిన మారణహోమాన్ని, దాడులను తక్షణమే ఆపాలని పౌర చైతన్య వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వేదిక విశాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.కోలవెన్ను చాంద్ ప్రసంగిస్తూ పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ప్రకటించాలని, యుద్ధ నేరస్తులు నేతన్యాహూ, ట్రంప్‌లను శిక్షించాలని, మోదీ ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో కుదుర్చుకున్న రక్షణ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గాజాలో జరిగిన ప్రాణనష్టం మానవత్వమున్న అందరినీ కలిచివేస్తోందన్నారు. అమెరికా అండతో గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న దురాగతాలను ఆయన తీవ్రంగా ఖండించారు. పౌర చైతన్య వేదిక విశాఖ కార్యదర్శి సీహెచ్.ప్రమీల మాట్లాడుతూ గాజా మారణహోమంపై ప్రధాని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా విమర్శించారు.ప్రభుత్వరంగ సంస్థ బీఈఎల్, అదానీ కంపెనీలు ఇజ్రాయెల్‌లోని ఎల్బిట్ కంపెనీతో రక్షణ ఒప్పందాలు కుదుర్చుకుని యుద్ధ టెక్నాలజీని అందించి, పరోక్షంగా యుద్ధానికి తోడ్పడుతున్నాయని ఆరోపించారు. వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.గోవిందరాజులు మాట్లాడుతూ తక్షణ కాల్పుల విరమణ, పాలస్తీనా రాజ్యానికి గుర్తింపు కోరుతున్న సమయంలో.. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక సామ్రాజ్యవాద ఉద్దేశం, కుట్రను బహిర్గతం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.అభిలాష్, సంతోష్, సృజన్, సామాజిక కార్యకర్తలు రామప్రభ, విజ్ఞానంద తదితరులు పాల్గొన్నారు.

'ద్వారం' విగ్రహంపై విరిగిపడిన డోమ్



బీచ్‌రోడ్డులో విగ్రహంపై విరిగిపడిన డోమ్

ఏయూ క్యాంపస్ : సాగర తీరంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాల నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. విగ్రహాలను శుభ్రం చేసేవారు, అవసరమైన మరమ్మతులు చేసేవారు కరువయ్యారు. కొన్ని నెలల క్రితం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ఇక్కడి విగ్రహాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పలు విగ్రహాలు పక్షుల వ్యర్థాలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. తాజాగా విక్టరీ ఎట్ సీ ఎదురుగా ఉన్న శాంతి వనంలో వయోలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడు విగ్రహం పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. విగ్రహంపై ఏర్పాటు చేసిన ఇనుప డోమ్ విరిగిపోయి ఆ విగ్రహంపై పడింది. దీనికి సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన ఇనుప పిల్లర్ తుప్పు పట్టడంతో విరిగిపోయింది. మొత్తంగా అక్కడ ద్వారం వెంకటస్వామి నాయుడు విగ్రహం కనిపించడం లేదు. అధికారులు వెంటనే దృష్టి సారించి మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.

నినాదాలు చేస్తూ దళిత నేత మృతి

గుండెపోటుతో కుప్పకూలిన ఆనంద్ కుమార్



ఆనంద్ కుమార్ (ఫైల్)

గోపాలపట్నం: దళిత, కార్మిక ఉద్యమ నాయకుడు, స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి డెంకాడ ఆనంద్‌కుమార్ మంగళవారం ఉదయం నిరసన కార్యక్రమంలో పాల్గొంటూ గుండెపోటుతో మృతి చెందారు. ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ దిగువన అంబేద్కర్ విగ్రహం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా దళిత పోరాట హక్కుల సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. నినాదాలు చేసిన అనంతరం గుండెల్లో నొప్పి రావడంతో పక్కకు వెళ్లి కూర్చున్న ఆనంద్‌కుమార్ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన ప్రస్తుతం కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. ఉద్యమ నేత మృతిపై పలువురు నాయకులు, స్టీల్‌ప్లాంట్ కార్మిక నేతలు, సహచరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేసి మృతదేహానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు ఉన్నారు.



ఆనంద్ కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ శ్రీధర్ తదితరులు

పారిశ్రామిక ప్రాంతాన్ని ముంచెత్తిన వర్షం



భారీ వర్షానికి తడిసి ముద్దయిన మల్కాపురం సేవా మార్గం



వర్షం కారణంగా ఆర్‌కే పురం వద్ద నిలిచిన బురద నీరు

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రంగా మారాయి. మంగళవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ, అంతలోనే వాతావరణం మారిపోయి ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీ వర్షం కారణంగా నౌసేనాబాగ్, మల్కాపురం, ఆర్‌కెపురం వంటి ప్రాంతాల్లోని సేవా మార్గాలు తడిసి ముద్దై, పలుచోట్ల నీరు నిలిచిపోయింది. మురుగునీటితో కలవడంతో ఈ మార్గాలు పూర్తిగా బురదమయంగా మారాయి. దీంతో పాదచారులతో పాటు, వాహనదారులు సైతం ఈ బురద మార్గాలపై ప్రయాణించడానికి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆఫీసుల నుంచి ఇళ్లకు తిరుగు ప్రయాణమైన అనేక మంది ఉద్యోగులు, ప్రజలు వర్షానికి తడిసిపోవాల్సి వచ్చింది.

దువ్వాడను ఆదర్శ స్టేషన్‌గా తీర్చిదిద్దుతాం

వాల్తేరు రైల్వే డీసీఎం పూజా సింగ్

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ పథకంలో భాగంగా ఆదర్శ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని తూర్పు కోస్తా రైల్వే, వాల్తేరు డివిజనల్ సీనియర్ మేనేజర్ పూజా సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం ఆమె దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్లాట్‌ఫామ్ ఒకటి వైపు నిర్మిస్తున్న పరిపాలనా భవనం, కంట్రోల్ రూమ్, స్టేషన్ మేనేజర్ కార్యాలయాల నిర్మాణ పనులను ఆమె పర్యవేక్షించారు. అనంతరం జరిగిన 'అమృత్‌సంవాద' సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అధికారుల ప్రతిపాదనలతో పాటు ప్రజా సంఘాలు, ప్రయాణికుల సూచనలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పలు సూచనలు చేశారు.



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీసీఎం పూజాసింగ్

ముఖ్యంగా ఎస్కలేటర్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ షెడ్లు నిర్మించాలని, రెండు ప్లాట్‌ఫామ్ వైపులా ఫుడ్ కోర్టులు, లో కాస్ట్ దుకాణాలు ఏర్పాటు చేయాలని మరియు పార్కింగ్ ఫీజులు తగ్గించాలని కోరారు. సమావేశం అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు పూజా సింగ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంతో పాటు అధికారులు రవికిరణ్, ఎం.ఎస్. రావు, గణేష్, జయరామ్ మరియు అసోసియేషన్ ప్రతినిధులు వి. జాషువా, వీర్రాజు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీవీవీ ఉపాధ్యాయుల ఆందోళన

ఉక్కునగరం: ఉక్కు కర్మాగారం ఆధ్వర్యంలో నడిచే విశాఖ విమల విద్యాలయం (వీవీవీ) ఉపాధ్యాయులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉక్కునగరంలో నిరసన చేపట్టారు. పాఠశాలను మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు, సిబ్బంది ఉక్కు తెలుగు తల్లి విగ్రహం కూడలి వద్ద బ్యానర్లు, ప్లకార్డులతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం తక్షణమే పాఠశాలను పునఃప్రారంభించాలని లేదా విద్యార్థులు, ఉపాధ్యాయుల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. పాఠశాల మూసివేత వల్ల సుమారు వెయ్యి మంది పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యారని, తమకు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఉక్కు యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బి. సత్యనారాయణ, అనిత, మధుసూదన్, సత్యవతి, జ్యోతి, మణి, రెజీనా, నాగవల్లి, శేషమణి, మేరీ సుగుణ, సుశీల తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసనలో వీవీవీ ఉపాధ్యాయులు

దేవీపురంలో ముగిసిన దసరా బ్రహ్మోత్సవాలు



జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పూజలందుకున్న సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన క్షేత్రంలో దసరా బ్రహ్మోత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. చివరి రోజు అమ్మవారు సహస్రాక్షి రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. లలితా సహస్ర నామావళి హోమం జరిపించారు. సహస్రాక్షి అమ్మవారికి, రాజరాజేశ్వరునికి వేద పండితుల మంత్రోచ్చారణలతో కళ్యాణమహోత్సవం కన్నులపండువగా జరిపారు. సాయంత్రం 6 నుంచి విశాఖపట్నం ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు.